క్లుప్తంగా

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలో ప్రత్యేక విద్యు త్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని శెట్టిపల్లి విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ విద్యుత్ అ దాలత్ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాసఆంజనేయమూర్తి, సభ్యులు రామమోహనరావు, అంజనీకుమార్, ఈ శ్వరమ్మ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారు లు పాల్గొని తమ సమస్యలను రాతపూర్వకంగా అదాలత్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎస్వీయూలో పరిశోధకులకు ప్రత్యేక మెస్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పీహెచ్‌డీ, పీడీఎఫ్ పరిశోధక విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బి-మెస్‌ను వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పీజీ విద్యార్థులతో కలసి పరిశోధక విద్యార్థులు ఒకే మెస్‌లో భోజనం చేసేవారని, వారి సౌకర్యార్థం కొత్త మెస్ ప్రారంభిచామన్నారు. ఇందులో ఫార్మసీ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధకుల వార్డెన్ ఆచార్య బాలాజీ, గోపి నాయక్, నరసింహ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

10న సాధు వర్ధంతి, గౌరిపెద్ది జయంతి

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రహ్మణ్యంశాస్త్రి 43వ వర్ధంతి, గౌరిపెద్ది రామసుబ్బయ్యశర్మ 102వ జయంతిని నిర్వహించనున్నారు. ముందుగా ఉదయం 9 గంటలకు ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో గౌరిపెద్ది రామసుబ్బయ్యశర్మ విగ్రహానికి, తర్వాత 9.30 గంటలకు శ్వేత భవనం ఎదురుగానున్న సాధు సుబ్రహ్మణ్యంశాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం 10.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రహ్మణ్యంశాస్త్రి వర్ధంతి సందర్భంగా సభా కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు గౌరిపెద్ది రామసుబ్బయ్యశర్మ 102 జయంతి సభా కార్యక్రమం నిర్వహిస్తారు.

పేదలకు అన్నదానం

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్ సీపీ నేత నితిన్ యాదవ్ తన తండ్రి ఈతమాకుల బలరాం యాదవ్ 12వ వర్ధంతి సందర్భంగా గురువారం చిన్న కాపు వీధిలో పేదలకు అన్నదానం చేశారు. దీనికి ముందు బలరాం యాదవ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాని యాదవ్, జల్లి తులసీ యాదవ్, సురేష్‌యాదవ్, వాసుదేవ యాదవ్, గోపి యాదవ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించని బార్లపై కేసులు

తిరుపతి క్రైమ్: నగరంలో సమయపాలన పాటించకుండా నిర్వహిస్తున్న బార్లపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బార్లపై దాడులు నిర్వహించామన్నారు. ఇందులో లక్ష్మీపురం సర్కిల్లోని యాలమూరి బార్ అండ్ రెస్టారెంట్, డీఆర్ మహల్ సమీపంలోని గణేష్ బార్ అండ్ రెస్టారెంట్‌లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఈ బార్లలోని క్యాషియర్లు, మేనేజర్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని వెల్లడించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

భాకరాపేట: మామిడి, టమాట పంటలను కూడా ఈ-క్రాప్ నమోదు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లు మండలం దేవదార్లపల్లె గ్రామ పంచాయతీ రైతు సేవా కేంద్రాల్లో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఈ పంట నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూక్ష్మ నీటి పారుదల పథకంలో డ్రిప్, స్ప్రింక్లర్లు వేసుకున్న రైతు వివరాలు కూడా ఈ-పంటలో నమోదు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీలోపు మిగిలిన మామిడి, టమాట ఇతర పంటలన్నీ ఈ-పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఉద్యానవన అధికారి శివకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అలరించిన సినీ గానలహరి



వర్సిటీ ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన

తిరుపతి సిటీ: ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో గురువారం రాత్రి నిర్వహించిన సినీ గానల హరి కార్యక్రమం విద్యార్థులను, అధ్యాపకులను ఆకట్టుకుంది. విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపే పాటలు, సాంప్రదాయ నృత్య ప్రదర్శన, ఘంటశాల సినీ గీతాలు వీక్షకులను అలరింపజేశారు. ప్రధానంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని నింపింది.

పైసలిచ్చుకో.. సిఫారసు లేఖ పుచ్చుకో!



- కీలక పోస్టులకు డిమాండ్‌ను బట్టి రేటు ఫిక్స్
- జేబులు నింపుతున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ
- పైసలిస్తే చాలు.. ఎక్కడి వారికి అక్కడే పనిచేసే ఛాన్స్
- కొందరు ఇవ్వలేమని వెళ్లిపోతున్నా వదలని వైనం
- ఇదీ చంద్రగిరి నియోజకవర్గంలో ఉద్యోగుల బదిలీలలు'

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించి నియమ నిబంధనలను కూడా విడుదల చేసింది. దీని ప్రకారం బదిలీలకు అర్హులైన ఉద్యోగులు మరోప్రాంతానికి వెళ్లాలంటే తొలుత ఆయా నియోజక వర్గాల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జ్ అనుమతి పొందాలనే 'అనధికారిక' నిబంధనను కూడా తెరపైకి తెచ్చారు. దీనిని అవకాశంగా చేసుకున్నారు చంద్రగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధి. ఇంకేముంది? వారి ఇంట కనక వర్షం కురుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా పైసలిస్తే తప్ప సిఫారసు లేఖలు ఇవ్వడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు శాఖల మండల స్థాయి అధికారుల నియామకంలో భారీగా వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. తాజాగా అన్ని ప్రభుత్వ శాఖల్లోని ద్వితీయ శ్రేణి, క్షేత్ర స్థాయి ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు గడువు సమీపిస్తుండడంతో మరోసారి ఆయన వసూళ్ల పర్వానికి తెర లేపినట్లు సమాచారం. కీలక పోస్టులకు ఉన్న డిమాండ్ బట్టి రేటు ఫిక్స్ చేయడమే గాక పైసలిస్తే చాలు.. ఐదేళ్లు ఒకేచోట పనిచేసి ఉన్నా సరే నిబంధనలను తుంగలో తొక్కి, ఎక్కడి వారికి అక్కడే పనిచేసే అవకాశం కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఉద్యోగులు వారు అడిగినంత సొమ్ము ఇచ్చుకోలేక బదిలీకి సిద్ధమై పక్క నియోజకవర్గాలకు వెళుతుంటే.. ఆ ఉద్యోగులపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు చెడుగా ప్రచారం చేసి అక్కడ కూడా అవకాశం రాకుండా చేయిస్తున్నట్లు సమాచారం. దీనిపై పలువురు ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అప్పట్లో అంతా పారదర్శకం..

వాస్తవానికి రెండు దశాబ్దాల క్రితం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు (చంద్రబాబు హయాంలో) బదిలీల్లో అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కౌన్సెలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎక్కడెక్కడ ఏయే పోస్టులు ఖాళీలు ఉన్నాయో వాటన్నింటినీ ప్రకటించి, సీనియారిటీ ఆధారంగా ఆ ఖాళీలు కౌన్సెలింగ్‌లో ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఫలితంగా ఫలానా చోటుకు బదిలీ చేయించండని నాయకులను చుట్టూ ప్రదక్షిణలు చేసే అగత్యం తప్పింది. అప్పట్లో ఇది ఉద్యోగులకు ఎంతగానో ఊరటనిచ్చింది.

పోస్టుల్ని బ్లాక్ చేసి.. కౌన్సెలింగ్‌కు తూట్లు

ఆ తర్వాత కాలంలో మరోసారి టీడీపీ అధికారంలోకి వచ్చాక కౌన్సెలింగ్ ప్రక్రియకు చంద్రబాబు ప్రభుత్వమే తూట్లు పొడిచింది. కీలకమైన పోస్టులు, అత్యంత ప్రాధాన్యం, ముఖ్యమైన ప్రాంతాల్లో ఖాళీలను కౌన్సెలింగ్‌లో ప్రకటించకుండా, వాటి ఊసెత్తకుండా బ్లాక్ చేయడం మొదలెట్టారు. ఈ 'బ్లాక్ పోస్టుల'కు డిమాండ్ ఉండడంతో వాటిని ఆశించిన ఉద్యోగులు ఇటు నేతలు, అటు అధికారుల జేబులు నింపి దక్కించుకునే పరిస్థితి కల్పించారు.

ఒకే చోట ఐదేళ్లకు పైగా ఉన్నా.. లేనట్టు కలరింగ్!

కొన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు ఒకే స్థానంలో ఐదేళ్లకు పైగా పనిచేస్తున్నప్పటికీ లేదన్నట్టుగా కలరింగ్ ఇస్తున్నారు. ఆ స్థానిక ప్రజా ప్రతినిధి ఆదేశాలతో వారి పేర్లను బదిలీల జాబితా నుంచే తప్పించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న వారంతా బదిలీకావాల్సి ఉంది. అయితే ఐదేళ్లకుపైగా ఒకే స్థానంలో ఉన్నప్పటికీ లేమంటూ బదిలీల జాబితా నుంచి మినహాయింపు పొందే ప్రయత్నం చేస్తున్న వారిలో ప్రధానంగా గ్రామీణ తాగునీటి సరఫరా, నీటి పారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన కొంత మంది ఇంజినీర్లతోపాటు తెలుగు తమ్ముళ్లకు వంత పాడుతున్న కొందరు గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రభుత్వ పెద్దలు, జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పుడు సిఫారసులతో మరింత అధ్వాన్నం

ఇప్పుడు కూటమి పాలనలో నిబంధనలకు పాతర వేసి కౌన్సెలింగ్ అంటే సిఫారసు లేఖలే అనే స్థితికి దిగజార్చారు. పక్కాగా ఉద్యోగుల జేబులు కొల్లగొడుతున్నారు. చంద్రగిరిలో ఒక చిన్న పోస్టుకైనా సరే లక్షకు తక్కువ లేకుండా సమర్పించుకోవాల్సి వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత కాలంగా చంద్రగిరి నియోజకవర్గానికి కొంత మంది ఉద్యోగులు డిప్యూటేషన్లపై వచ్చి పనిచేస్తుండగా, వాటిని కూడా ప్రభుత్వం రద్దు చేయడంతో వారి నుంచి కూడా ఒక్కో సిఫారసు లేఖకు లక్షలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇకపోతే గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అత్యధిక శాతం మంది చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని నిశ్చయించుకోగా వారిపై దుష్ప్రచారం ప్రచారం చేసి ఎక్కడా పోస్టింగ్ రానీయకుండా చేస్తానని బెదిరింపులకు దిగుతుండడం గమనార్హం.

మేయర్‌కు భూమన ఆశీస్సులు



టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆశీస్సులు తీసుకుంటున్న మేయర్ శిరీష

తిరుపతి మంగళం: తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష జన్మదిన వేడుకలను గురువారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తిరుపతి పద్మావతిపురంలోని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. మేయర్ శిరీషకు కరుణాకరరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు పుష్పగుచ్ఛంతో మేయర్ శిరీషకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి పెద్దకాపువీధి సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, డాక్టర్ అనీష్‌రాయల్, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, డాక్టర్ వరప్రసాద్, తిరుమలరెడ్డి, తులసీ యాదవ్, వెంకటేష్‌రాయల్, గీతాయాదవ్, అరుణ్ యాదవ్, పండుయాదవ్ మేయర్ శిరీష జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మేయర్ శిరీష దంపతులు కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

వరద సహాయక చర్యల్లో తిరుపతి అధికారులు



విజయవాడలో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య, అధికారులు

తిరుపతి తుడా: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచే వరకు సహాయ చర్యలు చేపట్టాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని వరద ప్రాంతాల్లో తిరుపతి నగరపాలక సంస్థ బృందం సహాయ చర్యలు చేపట్టింది. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్యతోపాటు 75మంది పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు, ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ డీఈలు తదితరులు బుధవారం విజయవాడకు చేరుకున్నారు. గురువారం ఉదయం కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. విజయవాడ నగరంలో పేరుకుపోయిన బురదను సకాలంలో తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సహాయక చర్యలలో మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు సంజయ్‌కుమార్, మహేష్, రాజు, రవీంద్రారెడ్డి, నరేంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, మేస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



సారె తీసుకువస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- శ్రీకల్యాణ వెంకన్న ఆలయం నుంచి సారె తెచ్చిన చెవిరెడ్డి కుటుంబం
- సాదర స్వాగతం పలికిన కొత్త శానంబట్ల గ్రామస్తులు

చంద్రగిరి: కొత్త శానంబట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమహా గణపతి ఆలయం కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి గ్రామ పెద్దలు ఆహ్వానం పలకడంతో గురువారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబ సభ్యులు తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సారె తీసుకుని వెళ్లారు. తమ గ్రామానికి సారె తెచ్చిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి, చెవిరెడ్డి మంజులకు శానంబట్లవాసులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద జరిగే పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి దర్శనం చేసుకున్న తర్వాత తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహా కుంభాభిషేకానికి హాజరైన గ్రామస్తులతో చెవిరెడ్డి లక్ష్మి ఆత్మీయతను పంచుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆలయం వద్ద పూజలు చేసిన అర్చకులు చెవిరెడ్డి కుటుంబసభ్యులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గురు పూజోత్సవం



సంస్కృత వర్సిటీలో రిటైర్డ్ అధ్యాపకులను సన్మానిస్తున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



సత్కారం అందుకుంటున్న ఆచార్య వెంకటరెడ్డి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ, ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలల్లో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాలలకు సేవలందించిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

గురుశిష్యుల బంధం అనిర్వచనీయం

తిరుపతి తుడా: గురుశిష్యుల బంధం అనిర్వచనీయమని స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఆసుపత్రి వైద్య అధ్యాపకులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నిర్వహించారు. మాజీ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం, డీన్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ రామ్. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగరాజు, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ మాధవి, నర్సింగ్ ప్రిన్సిపల్ సుధారాణి, డీన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆచార్య వెంకటరెడ్డికి ఘన సత్కారం

తిరుపతి కల్చరల్: నాలుగు దశాబ్దాలపాటు బడిని తన గుడిగా భావించి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దన మేటి అధ్యాపకుడు ఆచార్య కుంతాటి వెంకటరెడ్డిని వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీ నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, జ్ఞాపికతో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు సత్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, తిరుపతి బాలోత్సవం అధ్యక్ష, కార్యదర్శులు నడ్డి నారాయణ, వి.గురునాథం, ఎస్.మునిలక్ష్మి, డాక్టర్ రవీంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

చంద్రగిరి: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్ అధ్యక్షతన ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను వారు సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

రామచంద్రాపురం: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు అన్నారు. గురువారం మండలంలోని కమ్మ కండ్రిగ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సుగుణను, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన స్నేహలత, అరుణ, మనోహర్, లోకేష్‌బాబు, సులోచన, తేజోవతిలను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులే దిక్సూచి

పాకాల: విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి అని పాకాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీ రామన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10 మంది ఉపాధ్యాయులకు హెచ్‌ఎం మహ్మద్‌రఫీ సమక్షంలో లయన్స్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వరద బాధితులకు స్వహస్త చేయూత



టీటీడీ ఈఓను కలిసి అంగీకార పత్రాన్ని అందిస్తున్న టీటీడీ విశ్రాంత ఉద్యోగులు



ఆహార పదార్థాలతో న్యాయవాదులు

తిరుపతి కల్చరల్: విజయవాడలో వరదతో అవస్థలు పడతున్నవారికి స్వహస్త ఆర్గనైజేషన్ ప్రతినిధులు చేయూతనిచ్చారు. తిరుపతికి చెందిన స్వహస్త ఆర్గనైజేషన్ ప్రతినిధులు సుకుమార్, పురుషోత్తం, శ్రీనివాసులు, వెంకటేష్, వెంకటరామిరెడ్డి సభ్యుల సాయంతో వరద బాధితులు 500 మందికి ఆహారం, నీరు, పాలు పంపిణీ చేసి తమ ఉదారత చాటుకున్నారు. ప్రతి ఏటా వినాయక చవితినాడు తమ సొంత నిధులతో మట్టి వినాయకులను రూపొందించి, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే వారు. అయితే ఈ ఏడాది విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మట్టి వినాయక ప్రతిమలకు సమకూర్చుకున్న సొమ్ముతోపాటు సభ్యుల సాయం వరద బాధితులకు తమ వంతు సాయం అందించారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగుల దాతృత్వం

తిరుపతి(అలిపిరి): విజయవాడలో అపార నష్టం కలిగించిన వరద బాధితులను ఆదుకునేందుకు టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ముందుకొచ్చారు. దాదాపు రూ.35 లక్షలు సెప్టెంబర్ నెలకి సంబంధించిన మూలవేతనాన్ని అంగీకార పత్రం రూపంలో ఈఓకు అందజేశారు. ఈ మేరకు టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం టీటీడీ ఈఓ శ్యామల రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి తాటిపర్తి దాసు, నాయకులు ఎస్.మునిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయవాదుల సాయం

తిరుపతి లీగల్: విజయవాడ వరద బాధితులకు తిరుపతి సీనియర్ న్యాయవాది దివంగత కేఎస్ శ్రీధర్ జూనియర్ న్యాయవాదులు వివిధ ఆహార పదార్థాలను వితరణగా అందించినట్లు తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గోపీచంద్ తెలిపారు. గురువారం స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ హాల్ వద్ద దివంగత కేఎస్ శ్రీధర్ జూనియర్ న్యాయవాదులు 30 వేల రూపాయలకు పైగా విలువ చేసే బియ్యం బస్తాలు, వివిధ ఆహార పదార్థాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ తరఫున కూడా త్వరలో వరద బాధితులకు సహాయం అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు భవాని శంకర్ ప్రధాన కార్యదర్శి మార్టిన్ దివంగత కేఎస్ శ్రీధర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దైవలోక్ భూముల లీజును రద్దు చేయాలి

తిరుపతి కల్చరల్: అలిపిరి-జూ పార్క్ రోడ్డులో దైవలోక్ ప్రైవేటు సంస్థకు ఇచ్చిన భూముల లీజును టీటీడీ వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి మాట్లాడారు. గతంలో కరంబాడి వద్ద స్థలాన్ని టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం ఇంజినీర్లు చదును చేశారని, అయితే ఉద్యోగుల విధులకు హాజరయ్యేందుకు దూరమనే నెపంతో ఆ స్థలాన్ని విస్మరించారని తెలిపారు. ప్రస్తుతం వడమాలపేట ప్రాంతంలో కేటాయించిన ఇంటి స్థలాల కారణంగా ఉద్యోగులకు మరింత ఇబ్బందికరమని, అలిపిరి వద్ద ఉద్యోగులకు ఇంటి స్థలాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకుంటే ఈ నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. రవి, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో శ్రీవారి భక్తుడికి నకిలీ కల్యాణోత్సవ టికెట్లను విక్రయించి మోసం చేసిన కేసులో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, బాలాయపల్లి మండలం, గొట్టికాడుకు చెందిన సి.ప్రేమ్‌చంద్‌కు మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. 2019 జనవరి 14వ తేదీ తిరుమల సుపథం కాంప్లెక్స్‌లో టీటీడీ అధికారులు తనిఖీలు చేసి శ్రీవారి దర్శనానికి భక్తులను పంపుతుండగా విజయవాడకు చెందిన ఓ భక్తుడి వద్ద రెండు కల్యాణోత్సవం టికెట్లను నకిలీగా గుర్తించారు. విజిలెన్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ప్రేమ్‌చంద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు ప్రేమ్‌చంద్ రిమాండ్ సమయంలో పది రోజులు జైల్లో ఉండడంతో న్యాయమూర్తి అతనికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అవకతవకలపై విచారణ ప్రారంభం

పాకాల: మండలంలోని దామలచెరువులో గత కొంత కాలంగా వినిపిస్తోన్న అవినీతి ఆరోపణలపై విచారణ ప్రారంభమైందని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ డీపీఓ సుశీలాదేవి ఆదేశాల మేరకు రామచంద్రాపురం ఈఓపీఆర్డీ దేవికను విచారణ అధికారిగా నియమించారని తెలిపారు. ముఖ్యంగా పెట్రోల్ బిల్లులు, వేలం సొమ్ములు దుర్వినియోగం, నీళ్ల బిల్లులు దుర్వినియోగం తదితర ఆరోపణలపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అవినీతి ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ పూర్తి అయిన తరువాత తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువైతే సంబంధిత సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని వినతి

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలంలో నిరుపేదపై దాడి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు గురువారం చంద్రగిరి డీఎస్పీ నరసింగప్పను కలసి వినతిపత్రం అందజేశారు. బోడేవాండ్లపల్లెకు చెందిన చీనేపల్లి శ్రీనివాసులు బుధవారం రాత్రి తన ఆటోలో వెళ్తుండగా ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామి, కానిస్టేబుల్ దేవేంద్రనాయక్ నాటుసారాతో ఉన్నాడని పట్టుకుని చితకబాదారని తెలిపారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు బంధువు మహేష్ వచ్చి సొంత పూచీకత్తుపై తీసుకొచ్చి రుయా ఆసుపత్రిలో చేర్పించినట్లు వివరించారు. చీనేపల్లె శ్రీనివాసులుకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మార్రేళ్ల శ్రీనివాసులు, మహేష్, నాగరాజు, గుర్రం నారాయణ, చీకటపల్లి రామాంజనేయులు, గుంతాటి మురళీ, విశ్వనాథ, రవి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహార మాసోత్సవాలు

పాకాల: దామలచెరువు సెక్టార్ మొగరాల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఐసీడీఎస్ దామలచెరువు సెక్టార్ సూపర్ వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. పిల్లల పోషణతోపాటు వారి మానసిక, శారీరక అభివృద్ధికి, మేధో వికాసానికి తోడ్పడే అంశాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌లోని ఆకుకూరలు, కూరగాయలు, మిల్లెట్స్, పండ్లుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దయానంద, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.షమీమ్, మోహన, ధనలక్ష్మి, రేఖ, పుష్ప, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.